నమస్తే తెలంగాణ
హైదరాబాద్
హైదరాబాద్- మేడ్చల్
13 | హైదరాబాద్, శుక్రవారం 12 జనవరి 2024 | HYDERABAD

స్వచ్ఛ గుండ్లపోచంపల్లి

ఢిల్లీలో గురువారం కేంద్ర మంత్రులు హర్దీప్ సింగ్ పూరి, కౌశల్ కిశోర్ నుంచి స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డును అందుకుంటున్న మేడ్చల్ జిల్లా గుండ్లపోచంపల్లి మున్సిపల్ చైర్ పర్సన్ లక్ష్మీ శ్రీనివాస్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ రాములు తదితరులు

- మేడ్చల్ రూరల్, జనవరి 11

స్వచ్ఛ నిజాంపేట్

జోనల్ స్థాయిలో స్వచ్ఛ సర్వేక్షణ్-2023 అవార్డును నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ తరపున అందుకుంటున్న మేయర్ కొలన్ నీలాగోపాల్‌రెడ్డి, కమిషనర్ రామకృష్ణారావు తదితరులు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ నిజాంపేట్ కార్పొరేషన్‌కు స్వచ్ఛసర్వేక్షణ్ అవార్డు దక్కడం రెండవసారని, ఇందుకు తోడ్పాటును అందించిన ఎమ్మెల్యే కేపీ వివేకానంద్, ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజు, కార్పొరేటర్లు, అధికారులు, సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.

- దుండిగల్, జనవరి 11

ఐదు రోజులు 10 లక్షల దరఖాస్తులు

ముమ్మరంగా డేటా ఎంట్రీ

సిటీబ్యూరో, జనవరి 11 (నమస్తే తెలంగాణ) : గ్రేటర్ హైదరాబాద్‌లో అభయహస్తం దరఖాస్తు ఎంట్రీ ప్రక్రియ ముమ్మరంగా కొనసాగుతున్నది. 635 డేటా సెంటర్లతో 3500 మందితో కట్టుదిట్టమైన పర్యవేక్షణ నడుమ దరఖాస్తుల వివరాలను కంప్యూటీకరణ జరుపుతున్నారు. గ్రేటర్‌లో మొత్తం 24 లక్షల 74 వేల 325 దరఖాస్తులు స్వీకరించగా, అందులో అభయహస్తం అప్లికేషన్లు 19 లక్షలకు పైగా ఉన్నాయి. మిగతా 5.73 లక్షల అప్లికేషన్లు రేషన్ కార్డు, ఇతర సమస్యలపై వచ్చాయి. ఐదు రోజుల వ్యవధిలో 10 లక్షల అప్లికేషన్స్ డేటా ఎంట్రీ పూర్తయినట్లు అధికారులు తెలిపారు. గురువారం ఒక్కరోజే మూడు లక్షల డేటా ఎంట్రీ చేసినట్లు పేర్కొన్నారు.

కేంద్ర మంత్రి హర్దీప్ సింగ్ పూరి నుంచి అవార్డును అందుకుంటున్న జీహెచ్ఎంసీ కమిషనర్ రొనాల్డ్ రాస్ తదితరులు

5 స్టార్ క్లీన్ సిటీ

స్వచ్ఛ సర్వేక్షణ్‌లో జీహెచ్ఎంసీకి జాతీయ అవార్డు

2023 సంవత్సరానికి హైదరాబాద్ నగరానికి ఐదు అవార్డులు

సిటీబ్యూరో, జనవరి 11 (నమస్తే తెలంగాణ) : స్వచ్ఛ సర్వేక్షణ్-23లో జీహెచ్ఎంసీకి జాతీయ స్థాయి క్లీన్ సిటీ అవార్డులు వరించాయి. లక్ష జనాభా పైబడిన నగరాల్లో ఆల్ ఇండియాలో 9వర్యాంకు సాధించి, ఫైవ్‌స్టార్ రేటింగ్‌లో ఈ అవార్డును దక్కించుకుంది. ఢిల్లీలో భారత మండపం వేదికగా గురువారం జరిగిన అవార్డుల ప్రదానోత్సవంలో కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పూరి నుంచి అవార్డును జీహెచ్ఎంసీ కమిషనర్ రొనాల్డ్ రాస్, శానిటేషన్ అడిషనల్ కమిషనర్ ఉపేందర్‌రెడ్డి, ప్రాజెక్టు మేనేజర్ సోమ భరత్, శానిటరీ ఫీల్డ్ అసిస్టెంట్ మంజుల అందుకున్నారు. తెలంగాణలో స్వచ్ఛ నగరం, తెలంగాణలో మొదటి 5 స్టార్ రేటింగ్ పొందిన నగరం, వాటర్+సిటీగా మళ్లీ ధ్రువీకరించబడిందని అధికారులు తెలిపారు. కాగా 2023 సంవత్సరానికిగానూ ఐదు అవార్డులు దక్కడం కేసీఆర్ ప్రభుత్వానికే ఈ గుర్తింపు దక్కింది. పురపాలక శాఖ మాజీ మంత్రి కేటీఆర్ తీసుకున్న చొరవతో నగరానికి జాతీయ స్థాయి అవార్డులు వరించాయి. జాతీయ స్థాయిలో గ్రేటర్ హైదరాబాద్‌కు 5 అవార్డులు దక్కడంలో విశేష కృషి చేసిన ప్రతి ఒక్కరికీ మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్ రెడ్డి, కమిషనర్ రొనాల్డ్ రాస్ ధన్యవాదాలు తెలిపారు.

చలాన్లే కాదు.. ట్రాఫిక్‌నూ నియంత్రించాలి

- మన దగ్గరే ట్రాఫిక్ సిబ్బందికి 30శాతం అదనపు అలవెన్స్
- నగర పోలీస్ కమిషనర్ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి

బంజారాహిల్స్‌లోని కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్ వద్ద అంబులెన్స్‌ను ప్రారంభిస్తున్న నగర పోలీస్ కమిషనర్ కొత్త కోట శ్రీనివాస్‌రెడ్డి

సిటీబ్యూరో, జనవరి 11 (నమస్తే తెలంగాణ)/మారేడ్‌పల్లి : ఎన్‌ఫోర్స్‌మెంట్‌లో చలాన్లు వేయడం ఒక్కటే కాదని, రద్దీ సమయంలో ట్రాఫిక్ నియంత్రణపైనే దృష్టి పెట్టాలని నగర పోలీస్ కమిషనర్ కొత్త కోట శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. ట్రాఫిక్ అవగాహన వారంలో భాగంగా గురువారం బంజారాహిల్స్‌లోని కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్‌లోని ఆడిటోరియంలో హైదరాబాద్ సిటీ సెక్యూరిటీ కౌన్సిల్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ట్రాఫిక్ వలంటీర్లను సన్మానించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ ఇతర రాష్ట్రాలలో లేని విధంగా ట్రాఫిక్‌లో పనిచేసే సిబ్బందికి 30శాతం అదనంగా ప్రభుత్వం అలవెన్స్‌లు కల్పిస్తుందని ఇది మంచి పరిణామమని అన్నారు. ఈ సందర్భంగా ఫ్రీ లెఫ్ట్ బోర్డులను, అంబులెన్స్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నగర అదనపు సీపీలు విక్రమ్ సింగ్ మాన్, ట్రాఫిక్ అదనపు సీపీ విశ్వప్రసాద్, జాయింట్ సీపీ రంగనాథ్, డీసీపీలు సుబ్బారాయుడు, విజయ్‌కుమార్, శ్రీబాల తదితర అధికారులు పాల్గొన్నారు.

హెచ్ఎండీఏలో ఆమ్రపాలికి అదనపు బాధ్యతలు

సిటీబ్యూరో, జనవరి 11 (నమస్తే తెలంగాణ) : హెచ్ఎండీఏ జాయింట్ కమిషనర్ ఆమ్రపాలికి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ కమిషనర్ దానకిశోర్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం ఐటీ విభాగానికి విధులు నిర్వర్తిస్తున్న ఆమ్రపాలికి భూసమీకరణ పథకం (ల్యాండ్ పూలింగ్ స్కీం), లేక్ ప్రొటెక్షన్ కమిటీ, ఎస్టేట్ ఆఫీసర్, అర్బన్ ఫారెస్ట్రీ వింగ్ బాధ్యతలు అప్పగించారు. దీంతో పాటు ఏళ్ల తరబడి సంస్థలో సెక్రటరీ ఓఎస్డీగా కాంట్రాక్ట్ పద్ధతిన కొనసాగుతున్న రిటైర్డ్ అధికారి రాంకిషన్‌ను తొలగించారు. అలాగే ఎస్టేట్ ఆఫీసర్ కిషన్‌రావును బదిలీ చేశారు. డిప్యూటీ కలెక్టర్ కె. జాన ప్రసూనాంబను హెచ్ఎండీఏ కమిషనర్ ఓఎస్డీగా నియమించారు.

రామకృష్ణ మఠంలోని వివేకానంద ఆడిటోరియంలో ప్రసంగిస్తున్న స్వామి బోధమయానంద

వివేకానంద బోధనలే.. సమాజానికి దిశ

సిటీబ్యూరో, జనవరి 11 (నమస్తే తెలంగాణ)/కవాడిగూడ: సమాజానికి దిశాదశ చూపేది వివేకానంద బోధనలేనని రామకృష్ణ మఠం హైదరాబాద్ అధ్యక్షుడు స్వామి బోధమయానంద అన్నారు. వివేకానంద 162వ జయంతిలో భాగంగా రామకృష్ణ మఠంలోని వివేకానంద ఆడిటోరియంలో జరిగిన కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. రెండు రోజుల పాటు జరిగే యువజన దినోత్సవాల్లో భాగంగా తొలిరోజు కార్యక్రమంలో గుంటూరు టొబాకో బోర్డు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అద్దంకి శ్రీధర్ బాబు, డెక్స్‌టెరిటీ సీఈవో శరద్ వివేక్‌సాగర్ పాల్గొన్నారు.

హమ్మయ్య.. ఎండొచ్చింది

సిటీబ్యూరో, జనవరి 11 (నమస్తే తెలంగాణ): ఆగ్నేయం దిశ నుంచి తెలంగాణ వైపు వీస్తున్న గాలుల ప్రభావంతో గ్రేటర్‌లో ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరిగాయి. గురువారం ఉదయం నుంచి రాత్రి వరకు నగరంలో గరిష్ఠ ఉష్ణోగ్రత 30.5డిగ్రీలు, కనిష్ఠ ఉష్ణోగ్రత 18.5డిగ్రీలు, గాలిలో తేమ 46శాతంగా నమోదైనట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు వెల్లడించారు. ఇదిలా ఉండగా ఉదయం వేళలో పొగమంచు ఏర్పడే అవకాశాలున్నందున గ్రేటర్‌కు ఎల్లో హెచ్చరికలు జారీ చేశారు.

సేఫ్ సిటీ

సికింద్రాబాద్‌లోని హరిహర కళా భవన్‌లో నగర ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో విద్యార్థులు, ఐటీ ఉద్యోగులు, ఆటో డ్రైవర్లకు ట్రాఫిక్స్ రూల్స్‌పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ రూల్స్ ఫర్ సేఫ్ సొసైటీ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నగర సీపీ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి, ట్రాఫిక్ అదనపు కమిషనర్ విశ్వప్రసాద్, రవాణా శాఖ జాయింట్ కమిషనర్ రమేశ్, డీసీపీ సుబ్బరాయుడు, అదనపు డీసీపీ రంగారావు, ఏసీపీలు మధుసూదన్‌రెడ్డి, టీటీఐ ఏసీపీ శంకర్‌రాజు తదితరులు

- మారేడ్‌పల్లి, జనవరి 11

భారత్, ఇంగ్లండ్ టెస్టు.. బడి పిల్లలకు ఫ్రీ

ఉప్పల్ రాజీవ్‌గాంధీ స్టేడియంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న హెచ్‌సీఏ అధ్యక్షుడు జగన్ మోహన్ రావు

హైదరాబాద్, ఆట ప్రతినిధి : ఉప్పల్ రాజీవ్‌గాంధీ స్టేడియం వేదికగా ఈ నెల 25 నుంచి భారత్, ఇంగ్లండ్ తొలి టెస్టు కోసం హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్(హెచ్‌సీఏ) ముమ్మర ఏర్పాట్లు చేస్తున్నది. హెచ్‌సీఏ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రావు గురువారం స్టేడియం ఏర్పాట్లను స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో ఆరు నుంచి 12వ తరగతి పిల్లలకు మ్యాచ్‌ను ఉచితంగా చూసేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం. సంబంధిత స్కూల్ ప్రిన్సిపాల్స్ చేసిన దరఖాస్తుల ఆధారంగానే విద్యార్థులకు ప్రవేశం ఉంటుంది. ఈ నెల 18లోపు హెచ్‌సీఏ సీఈవో మెయిల్ ఐడీ (ceo.hydca@gmail.com)కి దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌సీఏ ఉపాధ్యక్షుడు దల్జీత్‌సింగ్, కార్యాదర్శి దేవరాజ్, సహాయక కార్యదర్శి బసవరాజు, కోశాధికారి శ్రీనివాస్‌రావు పాల్గొన్నారు.

వివరాలు వెల్లడిస్తున్న మాదాపూర్ డీసీపీ జి.వినీత్, చిత్రంలో అదనపు డీసీపీ నర్సింహారెడ్డి, ఏసీపీ నర్సింహారావు

తాళం వేసి ఉన్న ఇండ్లే టార్గెట్

పగలు డెలివరీలు.. రాత్రి చోరీలు

రూ.16 లక్షల చోరీ సొత్తు స్వాధీనం

20 కేసుల్లోని నిందితుడి అరెస్టు

శేరిలింగంపల్లి, జనవరి 11: డెలివరీ బాయ్ అవతారమెత్తి ఇండ్లల్లో దొంగతనాలు చేస్తున్న నిందితుడిని పోలీసులు అరెస్టు చేశారు. గచ్చిబౌలిలోని కార్యాలయంలో గురువారం మీడియా సమావేశంలో మాదాపూర్ డీసీపీ జి.వినీత్ నిందితుడి వివరాలు వెల్లడించారు. శ్రీకాకుళం జిల్లాకు చెందిన బబ్బడి అభిలాష్ (29) బీటెక్ మధ్యలో ఆపేసి నగరానికి వచ్చాడు. కేపీహెచ్‌బీ కాలనీలోని హెచ్ఎంటీ హిల్స్‌లో నివాసం ఉంటూ తాళం ఉన్న ఇండ్లను టార్గెట్ చేశాడు. డెలివరీ బాయ్‌గా పగటి పూట కాలనీల్లో తిరుగుతూ తాళం వేసి ఉన్న ఇండ్లపై రెక్కీ నిర్వహిస్తున్నాడు. రాత్రి సమయంలో ఆ ఇండ్లల్లో దొంగతనాలకు పాల్పడుతున్నాడు. తాళం, కిటికీ గ్రిల్స్‌ను కత్తిరించేందుకు బాలానగర్‌లో ఓ స్టీల్ బోల్టు కట్టర్‌ను కొనుగోలు చేశాడు. కట్టర్ సహాయంతో సులువుగా దొంగతనాలకు పాల్పడుతున్నాడు.

20 కేసుల్లో నిందితుడు..

రెండేండ్లుగా చందానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో 7, మియాపూర్ పీఎస్ పరిధిలో 7, గచ్చిబౌలి పరిధిలో 4, కేపీహెచ్‌బీ పీఎస్ పరిధిలో 2 నేరాలు చేశాడు. బాధితుల ఫిర్యాదుతో ఆయా పోలీస్‌స్టేషన్లలో నిందితుడు అభిలాష్‌పై కేసులు నమోదయ్యాయి. మియాపూర్ పోలీసులు ఆర్టీసీ కాలనీలో నిందితుడిని అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు. అతడి వద్ద నుంచి మొత్తం రూ. 16 లక్షల విలువ జేసే 26 తులాల బంగారు ఆభరణాలు, 300 గ్రాముల వెండి, 2 ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిపై పీడీ యాక్టు నమోదు చేసే విషయాన్ని పరిశీలిస్తామని డీసీపీ వినీత్ తెలిపారు. ఈ సమావేశంలో మాదాపూర్ అడిషనల్ డీసీపీ నంద్యాల నర్సింహారెడ్డి, మియాపూర్ ఏసీపీ నర్సింహారావు, సీఐ ప్రేమ్‌కుమార్‌లు పాల్గొన్నారు.

పోలీసులు స్వాధీనం చేసుకున్న బంగారు, వెండి ఆభరణాలు, కట్టర్

పెట్రోల్ అయిపోయిందా.. బండి వదిలెయ్

నకిలీ కీతో బైకుల చోరీ

దొంగ బండ్లపై దర్జాగా షికారు

ఎర్రగడ్డ, జనవరి 11 : డూప్లికేట్ కీ సహాయంతో పార్కింగ్ చేసిన ద్విచక్ర వాహనాలను తస్కరిస్తున్నారు. చోరీ వాహనాలపై దర్జాగా తిరుగుతూ ఇంధనం అయిపోయిన వెంటనే ఆ వాహనాన్ని అక్కడే వదిలేసి మరో వాహనం దొంగలిస్తున్నారు. ఎట్టకేలకు బోరబండ పోలీసులు నిందితుడిని అరెస్టు చేసి, కోర్టులో హాజరుపర్చారు. డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ భూపాల్‌గౌడ్ కథనం ప్రకారం.. పాతబస్తీ నివాసి సయ్యద్ నిజాం అహ్మద్ ఒంటరిగా ఉంటున్నాడు. రోడ్లపై తిరుగుతూ పార్కింగ్ చేసి ఉన్న ద్విచక్ర వాహనాలను డూప్లికేట్ కీ సహాయంతో తస్కరిస్తున్నాడు. బోరబండ ఠాణా పరిధిలో ద్విచక్ర వాహనాలు మాయమైన ఘటనలపై పోలీసులకు ఫిర్యాదులు అందాయి. పోలీసులు సీసీ ఫుటేజీ ఆధారంగా నిందితుడిని గురువారం అరెస్టు చేసి, కోర్టులో హాజరు పర్చినట్లు డీఐ పేర్కొన్నారు. నిందితుడి వద్ద నుంచి రెండు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు.

మది కేరింత

మాదాపూర్‌లోని హెచ్ఐసీసీలో గురువారం జరిగిన ఓ ప్రైవేటు కార్యక్రమంలో కేరింత ఫేం నటి తేజస్వి సందడి చేసింది.

- మాదాపూర్, జనవరి 11

భద్రం మహాలక్ష్మి

సంక్రాంతి పండుగ నేపథ్యంలో నగరం నుంచి సొంతూళ్లకు వెళ్లే ప్రయాణికుల రద్దీ పెరుగడంతో ఎంజీబీఎస్‌లో పోలీసు బందోబస్తు మధ్య బస్సెక్కుతున్న మహిళలు